ప్రభుత్వ పాఠశాలలో గదుల కొరత

- 351 మంది విద్యార్థులకు ఐదు గదులే
- ఒక్కో గదిలో 70 మంది విద్యార్థులను కూర్చోబెట్టి పాఠాలు చెబుతున్న వైనం
- అవి కూడా శిథిలావస్థకు..
- ఇరుకు గదుల్లో ఇబ్బందులు పడుతున్న విద్యార్థులు


నేరేడుచర్ల జిల్లా పరిషత్‌ ఉన్నత పాఠశాల

నేరేడుచర్ల : పట్టణంలోని జిల్లా పరిషత్‌ ఉన్నత పాఠశాలలో తరగతి గదులు సరిపడా లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. పాఠశాలలో 6వ తరగతి నుంచి 10వ తరగతి వరకు 351 మంది విద్యార్థులు ఉన్నారు. అయితే పాఠశాలలో అసలే ఇరుకు గదులు, అందులో ఒక్కొక్క తరగతి గదిలో సుమారు 70 మందికి పైగా కూర్చోబెడుతున్నారు. పాఠశాలను 1970లో నిర్మించారు. పాఠశాలలో మొత్తం ఏడు గదులు ఉండగా.. ప్రధానోపాధ్యాయుడి గది, స్టాఫ్‌ గది, మూడు తరగతి గదులు శిథిలావస్థకు చేరాయి. ప్రభుత్వ నిబంధనల ప్రకారం తరగతి గదుల్లో 50 మంది విద్యార్థులను మాత్రమే కూర్చోబెట్టాలి. 50 మంది కంటే ఎక్కువగా ఉంటే అదనపు సెక్షన్‌ ఏర్పాటు చేయాల్సి ఉంది. కానీ నేరేడుచర్ల జెడ్పీహెచ్‌ఎస్‌లో ఒక్కొక్క గదిలో 70 నుంచి 80 మంది విద్యార్థులను కూర్చొబెట్టి పాఠాలు బోధిస్తున్నారు. ఇక పాఠశాలలో విద్యార్థుల సంఖ్య ఎక్కువగా ఉండటంతో మరుగుదొడ్లు, మూత్రశాలలు కూడా సరిపడా లేక బాల, బాలికలు తీవ్ర అవస్థలకు గురి అవుతున్నారు. గతంలో మన ఊరు– మన బస్తీ కార్యక్రమం కింద నాలుగు అదనపు తరగతి గదుల నిర్మాణానికి నిధులు మంజూరైనప్పటికీ ఆ పనులు నేటికీ ప్రారంభం కాలేదు. దీంతో నిధులు వెనక్కి వెళ్లాయి. ప్రస్తుతం విద్యార్థులకు అనుగుణంగా మరో 8 తరగతి గదులు నిర్మించాలని, గ్రంథాలయం, ప్రధానోపాధ్యాయుడి గది, ఉపాధ్యాయుల స్టాఫ్‌ రూమ్‌ ఉంటేనే సమస్యలు పరిష్కారం అవుతాయని విద్యార్థుల తల్లిదండ్రులు అంటున్నారు.

ఇరుకు గదుల్లో ఇబ్బందులు పడుతున్నాం


పాఠశాలలో ఇరుకు గదుల్లో కూర్చొని చదువుకోవాలంటే ఇబ్బందిగా ఉంది. మా తరగతి గదిలో 70 మందికి పైగా కూర్చుంటున్నాం. కూర్చొని లేవడం, బ్యాగులు పెట్టుకోవడం, పాఠాలు వినేందుకు కష్టంగా ఉంటోంది. విశాలమైన నూతన తరగతి గదులు, మూత్రశాలలు, మరుగుదొడ్లు నిర్మించి సమస్యలు పరిష్కరించాలి.
– శృతిహాసిని, 8వ తరగతి, నేరేడుచర్ల

తరగతి గదులు సరిపోవడం లేదు


పాఠశాలలో తరగతి గదులు సరిపడా లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నాం. గతంలో కంటే ఈ విద్యా సంవత్సరం 120 మంది అదనంగా చేరడంతో ఉన్నత తరగతి గదులు సరిపోవడం లేదు. అదనపు తరగతి గదుల నిర్మాణానికి నిధుల కోసం ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం.
– బట్టు మధు, ప్రధానోపాధ్యాయుడు, నేరేడుచర్ల

క్లుప్తంగా

స్టడీ మెటీరియల్‌ అందజేత


పల్‌ రెడ్డి ఫౌండేషన్‌ అందజేసిన స్టడీ మెటీరియల్‌తో విద్యార్థులు

హుజూర్‌నగర్‌ (చింతలపాలెం) : చింతలపాలెం మండలంలోని దొండపాడు జిల్లా పరిషత్‌ ఉన్నత పాఠశాలలో నేషనల్‌ మీన్స్‌ కం మెరిట్‌ స్కాలర్‌ షిప్‌ కోసం సన్నద్ధమవుతున్న విద్యార్థులకు పల్‌రెడ్డి ఫౌండేషన్‌ ఆధ్వర్యంలో సమన్వయకర్త కె.రామారావు సుమారు రూ.5 వేల విలువైన స్టడీ మెటీరియల్‌ను గురువారం అందజేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం సత్తిరెడ్డి, ఉపాధ్యాయులు వెంకట్‌రెడ్డి, రషీదుద్దీన్‌, వెంకటేశ్వర్లు, శ్రీనివాస్‌, క్రాంతి కుమార్‌, అశోక్‌రెడ్డి, జానీబేగం తదితరులు పాల్గొన్నారు.

పెంచికల్‌దిన్నె పీహెచ్‌సీ వైద్యాధికారిగా సౌమ్యశ్రీ


బాధ్యతలు స్వీకరిస్తున్న సౌమ్యశ్రీ

నేరేడుచర్ల : మండలంలోని పెంచికల్‌దిన్నె ప్రాథమిక ఆరోగ్య కేంద్రం అధికారిగా సౌమ్యశ్రీ గురువారం బాధ్యతలు స్వీకరించారు. అక్కడ పని చేసిన సీతా మహాలక్ష్మి మేళ్లచెరువుకు బదిలీపై వెళ్లగా నేరేడుచర్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యాధికారినిగా పని చేస్తున్న సౌమశ్రీ బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు కృషి చేస్తానని తెలిపారు.

శిథిలావస్థకు చేరిన ఇళ్ల పరిశీలన


ఇళ్లను పరిశీలిస్తున్న అధికారులు

హుజూర్‌నగర్‌ : ఇటీవల కురిసిన భారీ వర్షాలు, వరదలతో హుజూర్‌నగర్‌లో శిథిలావస్థకు చేరిన వారి గృహాలను గురువారం అధికారులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయా గృహాల స్థితిగతుల వివరాలను అధికారులు నమోదు చేసుకున్నారు. కార్యక్రమంలో రెవెన్యూ, ఇరిగేషన్‌, మున్సిపల్‌ అధికారులు మట్టయ్య, సంపత్‌, రమేష్‌, సిబ్బంది పాల్గొన్నారు.

జూడో పోటీల్లో యాతవాకిళ్ల విద్యార్థి ప్రతిభ


కాంస్య పతకం అందుకుంటున్న ఉమర్‌

మఠంపల్లి : యాదాద్రి భువనగిరి జిల్లాలోని మోత్కూర్‌లో గలచైతన్య స్కూల్‌లో ఈనెల 18న రాత్రి నిర్వహించిన ఉమ్మడి నల్గొండ జిల్లా స్థాయి జూడో పోటీల్లో మఠంపల్లి మండలంలోని యాతవాకిళ్లకు చెందిన ఏడవ తరగతి విద్యార్థి షేక్‌ ఉమర్‌ ప్రతిభ కనబరిచి కాంస్య పతకం, ప్రశంసాపత్రం సాధించాడు. ఈ సందర్భంగా గురువారం ఉమర్‌ను తల్లిదండ్రులు షేక్‌జాన్‌, రేష్మా దంపతులు, గ్రామపెద్దలు అభినందించారు.

విద్యార్థులకు నోట్‌ బుక్స్‌ పంపిణీ


నోట్‌ బుక్స్‌ పంపిణీ చేస్తున్న లయన్స్‌ క్లబ్‌ సభ్యులు

నేరేడుచర్ల : మున్సిపాలిటీలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు రాపోలు నవీన్‌ కుమార్‌ సహకారంతో గురువారం లయన్స్‌ క్లబ్‌ ఆధ్వర్యంలో పెన్నులు, పెన్సిళ్లు పంపిణీ చేశారు. నేరేడుచర్ల క్లబ్‌ అధ్యక్షుడు జిలకర రామస్వామి, జెడ్పీహెచ్‌ఎస్‌ హెచ్‌ఎం బట్టు మధు, కర్రి సూర్యనారాయణరెడ్డి, కట్టా శ్రీనివాస్‌రెడ్డి, కందిబండ శ్రీనివాస్‌ ఉన్నారు.

రహదారిపై గండి పూడ్చివేత


గండిని పూడ్చివేయిస్తున్న ఎస్‌ఐ అజయ్‌కుమార్‌

నడిగూడెం : మండల కేంద్రంలో ఇటీవల కురిసిన భారీ వర్షానికి చౌదరి చెరువు అలుగు పోయడంతో ఎస్సీ, బీసీ కాలనీల్లోకి నీరు చేరింది. దీంతో అత్యవసరంగా నీరు దిగువన చెరువులోకి వెళ్లేందుకు చాకిరాలకు వెళ్లే రహదారికి గండి పెట్టారు. గురువారం స్థానిక ఎస్‌ఐ జి.అజయ్‌కుమార్‌ గండిని పూడ్చివేయించారు. దీంతో ప్రజల రాకపోకలకు ఇబ్బందులు తొలగాయి.

పోషకాహారంతో.. పుట్టబోయే బిడ్డకు ఆరోగ్యం

- కలెక్టర్‌ తేజస్‌ నంద్‌లాల్‌ పవార్‌


అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారికి అన్నప్రాసన చేస్తున్న కలెక్టర్‌ తేజస్‌ నంద్‌లాల్‌ పవార్‌

గరిడేపల్లి : గర్భిణులు పోషకాహారం తీసుకుంటేనే పుట్టబోయే బిడ్డ సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారని కలెక్టర్‌ తేజస్‌ నంద్‌లాల్‌ పవార్‌ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని అంగన్‌వాడీ సెంటర్‌ –1 పరిధిలో నిర్వహించిన జాతీయ పోషణ మాసోత్సవాల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. పోషకాహారం, పూర్వ ప్రాథమిక విద్య గురించి తల్లిదండ్రులకు వివరించారు. ఆరోగ్య కార్యకర్తల సేవలు వినియోగించుకోవాలని తెలిపారు. అనంతరం కలెక్టర్‌ చేతుల మీదుగా సామూహిక అన్న ప్రసన, అక్షరభ్యాసం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్‌ కవిత, ఎంపీడీఓ సరోజ, సీడీపీఓ వెంకటలక్ష్మి, డాక్టర్‌ నరేష్‌, ఎంఈఓ చత్రు నాయక్‌, సూపర్‌వైజర్‌ రేవతి, కేవీకే శాస్త్రవేత్త సునందిని, పోషణ్‌ అభియాన్‌ బ్లాక్‌ కోఆర్డినేటర్‌ రాజేష్‌, అంగన్‌వాడీ టీచర్స్‌, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి


ప్రైవేటు ఉపాధ్యాయులను సన్మానిస్తున్న నర్సింహారావు

నేరేడుచర్ల : ప్రభుత్వ, ప్రైవేటు ఉపాధ్యాయుల సంక్షేమం కోసం ఉపాధ్యాయ సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని తెలంగాణ ప్రైవేటు టీచర్స్‌ అండ్‌ లెక్చరర్ల ఫెడరేషన్‌ జిల్లా కన్వీనర్‌ నర్సింహారావు అన్నారు. గురువారం నేరేడుచర్లలోని అంజలి స్కూల్‌లో తెలంగాణ ప్రైవేటు టీచర్స్‌ అండ్‌ లెక్చరర్ల ఫెడరేషన్‌ జిల్లా కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రైవేటు టీచర్స్‌ను సన్మానించి మాట్లాడారు. ప్రైవేటు ఉపాధ్యాయులకు ప్రభుత్వం సంక్షేమ ఫలాలు అందేలా చూడాలని, గుర్తింపు కార్డులు అందజేయాలన్నారు. కార్యక్రమంలో అంజలి స్కూల్‌ కరస్పాండెంట్‌ అలక సైదిరెడ్డి, ఉపాధ్యాయులు జానకిరాములు, నాగ నాగమణి, టీపీటీఎల్‌ జిల్లా నాయకులు మామిడి జానకిరాములు, ఉపేంద్రాచారి, గోవర్ధన్‌రావు, జనార్దన్‌, నాగరాజు, నాగలక్ష్మి, సుజాత, సత్య, శ్రీనివాస్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

విద్యార్థులు క్రీడల్లోనూ రాణించాలి


కోదాడరూరల్‌ : మండల స్థాయి క్రీడా పోటీలను ప్రారంభిస్తున్న మున్సిపల్‌ కమిషనర్‌

కోదాడరూరల్‌ : విద్యార్థులు చదువుతో పాటు క్రీడాల్లో కూడా రాణించాలని మున్సిపల్‌ కమిషనర్‌ రమాదేవి అన్నారు. గురువారం కోదాడ పట్టణంలోని బాలుర ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న మండల స్థాయి పాఠశాల క్రీడలను ఆమె ప్రారంభించి మాట్లాడారు. తల్లిదండ్రులు తమ పిల్లలను క్రీడాల్లో కూడా ప్రోత్సహించాలని కోరారు. ఈ క్రీడల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన వారిని జిల్లా స్థాయికి ఎంపిక చే యనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్‌ లంకెల రమాదేవినిరంజన్‌రెడ్డి, ఎంఈఓ సలీం షరీఫ్‌, పీడీ, పీఈటీలు, ఉపాధ్యాయులు ఉన్నారు.

ముగిసిన మండల స్థాయి క్రీడలు

హుజూర్‌నగర్‌ : పట్టణంలో నిర్వహిస్తున్న మండల స్థాయి పాఠశాలల క్రీడలు గురువారం ముగిశాయి. బుధవారం మొదలైన 14– 17 ఏళ్లలోపు బాలబాలికల క్రీడోత్సవాల్లో మండలంలోని వివిధ పాఠశాలల నుంచి మొదటి రోజు బాలురు 450 మంది, రెండవ రోజు బాలికలు 250 మంది పాల్గొన్నట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో ఎంఈఓ సైదానాయక్‌, జీహెచ్‌ఎం బీరెల్లి శ్రీనివాస్‌రెడ్డి, పీడీలు, పీఈటీలు తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి మండల స్థాయి స్కూల్‌ గేమ్స్‌

చిలుకూరు : చిలుకూరు జిల్లా పరిషత్‌ ఉన్నత పాఠశాలలో శుక్రవారం నుంచి రెండు రోజుల పాటు మండల స్థాయి స్కూల్స్‌ గేమ్స్‌ నిర్వహించనున్నట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కరుణాకర్‌రెడ్డి తెలిపారు. గురువారం స్థానికంగా నిర్వమించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అండర్‌– 14, 17 విభాగంలో బాల బాలికలకు కబడ్డీ, వాలీబాల్‌, ఖో–ఖో క్రీడలు నిర్వహించనున్నట్లు తెలిపారు. శుక్రవారం బాలురకు, శనివారం బాలికలకు క్రీడలు నిర్వహించనున్నట్లు తెలిపారు. అర్హత కలిగిన క్రీడాకారులు పాల్గొనాలని కోరారు.

సైబర్‌ నేరాలపై అవగాహన


అవగాహన కల్పిస్తున్న ఎస్‌ఐ నరేష్‌

గరిడేపల్లి : సైబర్‌ నేరాలపై ప్రతిఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని ఎస్‌ఐ చలిగంటి నరేష్‌ అన్నారు. గురువారం ఎస్పీ సన్‌ప్రీత్‌సింగ్‌ ఆదేశాల మేరకు మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌లో సైబర్‌ నేరాలపై, గంజాయి, డ్రగ్స్‌ మత్తు పదార్థాలపై అవగాహన కల్పించి మాట్లాడారు. సైబర్‌ మోసాలకు గురి కావద్దని, బ్యాంక్‌ ఖాతా, ఏటీఎం కార్డు వివరాలు, ఓటీపీ వివరాలు ఇతరులకు తెలపవద్దన్నారు. వ్యక్తిగత ఫోటోలను డీపీలుగా పెట్టుకోవద్దన్నారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

క్షయ వ్యాధిని ఆరు నెలల్లో నయం చేయొచ్చు

మునగాల : క్షయ వ్యాధిని ఆరు నెలల చికిత్సతో పూర్తిగా నయం చేయవచ్చని టీబీ నోడల్‌ అధికారి లింగం రామకృష్ణ తెలిపారు. గురువారం మండలంలోని రేపాల ప్రాథమిక ఆరోగ్య కేంద్ర పరిధిలోని నేలమర్రిలో క్షయ వ్యాధి నిర్ధారణ శిబిరాన్ని ప్రారంభించి మాట్లాడారు. 13 మంది నుంచి నమూనాలు సేకరించి ల్యాబ్‌కు పంపినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పి.శిరీష, ల్యాబ్‌ టెక్నీషియన్‌ స్వాతి, హెల్త్‌ అసిస్టెంట్‌ లింగయ్య, ఏఎన్‌ఎం లలిత, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

రూ.37,116 పలికిన వినాయకుడి లడ్డూ


వేలంలో దక్కించుకున్న లడ్డూ తీసుకెళ్తున్న భక్తులు

నడిగూడెం : మండలంలోని బృందావనపురంలో శ్రీరామాలయ యూత్‌ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయకుడి వద్ద గురువారం లడ్డూ వేలం పాట నిర్వహించారు. గ్రామానికి చెందిన మేకల నరేందర్‌–శిరీష దంపతులు రూ.37,116కు లడ్డూను వేలం పాటలో దక్కించుకున్నారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

సీపీఐ ధర్నాకు మద్దతిస్తాం

మఠంపల్లి : జిల్లాలో ఇటీవల కురిసిన వర్షాలకు తెగిపోయిన రోడ్లు, కాలువల మరమ్మతులు చేపట్టి, వరదలకు పొలాలు కొట్టుకుపోయి నష్టపోయిన రైతులకు నష్ట పరిహారం చెల్లించాలని డిమాండ్‌ చేస్తూ ఈనెల 20న సూర్యాపేట జిల్లా కలెక్టరేట్‌ వద్ద సీపీఐ ఆధ్వర్యంలో చేపట్టబోయే ధర్నాకు జిల్లా వ్యవసాయ కార్మిక సంఘం మద్దతు తెలుపుతుందని ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ధూళిపాల ధనుంజయనాయుడు తెలిపారు. గురువారం మఠంపల్లిలో ఆయన విలేకరులతో మాట్లాడారు. పొలాల్లో ఇసుక మేటలు వేసి పంట నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.50వేలు చెల్లించాలన్నారు. గ్రామాల్లో తాగు, సాగు నీటి సరఫరాను పునరుద్ధరించాలన్నారు. ఆయన వెంట సీపీఐ మండల కార్యదర్శి అమరారపు పున్నయ్య, తదితరులు ఉన్నారు.

చిలుకూరుకు చేరిన ప్రజా చైతన్య యాత్ర


మాట్లాడుతున్న బాదె నర్సయ్య

చిలుకూరు : ప్రజా సమస్యలపై ప్రజా కళాకారుడు బాదె నర్సయ్య రాష్ట్ర వ్యాప్తంగా చేపట్టిన ప్రజా చైతన్య యాత్ర గురువారం చిలుకూరు మండల కేంద్రానికి చేరుకుంది. ఈ సందర్భంగా బాదె నర్సయ్య మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలను గురుకుల పాఠశాలలుగా మార్చాలని డిమాండ్‌ చేశారు. ప్రతి గ్రామంలో వైద్యశాల ఏర్పాటు చేయాలని, ప్రభుత్వ ఉద్యోగాలు భర్తీ చేయాలని, నిరుద్యోగ భృతి ఇవ్వాలన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ప్రజా సమస్యలు తెలుసుకొని, వాటి పరిష్కారానికి కృషి చేస్తామన్నారు.

శ్రీనివాసరెడ్డి చేసిన సేవలు మరువలేనివి


శ్రీనివాసరెడ్డి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న రామకృష్ణ

మునగాల : విద్యా, పత్రికా రంగంలో గాయం శ్రీనివాసరెడ్డి చేసిన సేవలు మరువలేనివని బీసీ విద్యార్థి సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి పచ్చిపాల రామకృష్ణయాదవ్‌, పీవైఎల్‌ రాష్ట్ర కార్యదర్శి ధరావత్‌ రవి అన్నారు. మునగాల మండల కేంద్రానికి చెందిన గాయం శ్రీనివాసరెడ్డి (46) ఇటీవల గుండెపోటుతో మృతి చెందారు. గురువారం మునగాలలో నిర్వహించిన సంతాప కార్యక్రమంలో ఆయన పాల్గొని శ్రీనివాస్‌రెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి మాట్లాడారు.

ధర్నా పోస్టర్‌ ఆవిష్కరణ


పోస్టర్‌ ఆవిష్కరిస్తున్న కార్మిక సంఘం నాయకులు

కోదాడరూరల్‌ : కార్మికుల సమస్యల పరిష్కారం కోసం హైదరాబాద్‌లోని ఇందిరా పార్క్‌ వద్ద ఈ నెల 30న భారత కార్మిక సంఘాల సమైక్య ఆధ్వర్యంలో నిర్వహించ తలపెట్టిన మహా ధర్నాను విజయవంతం చేద్దామని ఐఎఫ్‌టీయూ జిల్లా సహాయ కార్యదర్శి వి.నరసింహారావు పిలుపునిచ్చారు. గురువారం పట్టణంలోని లాల్‌ బంగ్లా వద్ద ఆయన ధర్నా పోస్టర్‌ ఆవిష్కరించి మాట్లాడారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అవలంబిస్తున్న కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా రాష్ట్రంలో కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి ఈ ధర్నా నిర్వహిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో ఐఎఫ్‌టీయు జిల్లా నాయకులు కామళ్ల శ్రీను, ఉదయగిరి, దాసరి వెంకటేశ్వర్లు, కామల్ల రవి, మైసయ్య, వీరబాబు, నరసింహారావు, రామారావు ఉన్నారు.

ఎస్కేప్‌ కాలువలోకి మొసలి


పోలేనిగూడెం వంతెన వద్ద పరిశీలిస్తున్న తహసీల్దార్లు ధృవకుమార్‌, ఆంజనేయులు

చిలుకూరు : నాగార్జునసాగర్‌ ఎడమ కాలువ నుంచి ఎస్కేప్‌ ద్వారా బేతవోలు వీర్లదేవి చెరువుకు వెళ్లే కాలువలో పోలేనిగూడెం బ్రిడ్జి వద్ద మొసలి కనబడిందని రైతులు రెవెన్యూ అధికారులకు సమాచారం ఇచ్చారు. దీంతో గురువారం చిలుకూరు, మునగాల తహసీల్దార్లు కాలువను పరిశీలించారు. కాలువ పక్కన గల పొలాల రైతులు జాగ్రత్తగా ఉండాలని సూచించారు. రాత్రి సమయంలో పొలాల వద్దకు వెళ్లవద్దని చెప్పారు. మొసలి కాలువ ద్వారా బేతవోలు చెరువుకు వెళ్లే అవకాశం ఉన్నదని తెలిపారు. శుక్రవారం అటవీ శాఖ అధికారులు కాలువ మొత్తాన్ని పరిశీలించనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆర్‌ఐ మంత్రిప్రగడ సీతయ్య తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా కనకదుర్గమ్మ పండుగ


ప్రభబండ్లతో ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్న భక్తులు


శాకాంబరీ అవతారంలో అమ్మవారు

హుజూర్‌నగర్‌ : పట్టణంలో నిర్వహిస్తున్న ముత్యాలమ్మ జాతరలో భాగంగా కనకదుర్గమ్మ పండుగను గురువారం వైభవంగా నిర్వహించారు.. ఈ సందర్భంగా వేలాది మంది భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. అమ్మవారికి బోనాలు సమర్పించారు. ప్రజలు ప్రభబండ్లతో ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేసి భక్తిని చాటుకున్నారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా కమిటీ సభ్యులు సౌకర్యాలు కల్పించారు. పోలీసులు బందోబస్త్‌ ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, ప్రముఖులు, భక్తులు, మహిళలు పాల్గొన్నారు.

పారదర్శకంగా ఓటరు జాబితా


కోదాడరూరల్‌ : సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ రాంచందర్‌రావు

కోదాడరూరల్‌ : కోదాడ మండల ఓటరు జాబితాను పారదర్శకంగా రూపొందించనున్నట్లు ఎంపీడీఓ రాంచందర్‌రావు తెలిపారు. గురువారం స్థానిక మండల పరిషత్‌ కార్యాలయంలో ఓటరు జాబితాపై రాజకీయ నాయకులతో సమీక్ష సమావేశం నిర్వహించి ఓటరు జాబితాపై అభ్యంతరాల స్వీకరణ, తుది జాబితా రూపకల్పనపై సలహాలు, సూచనలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఓటరు జాబితాపై అభ్యంతరాలుంటే గ్రామ పంచాయతీల్లో కార్యదర్శులకు ఈ నెల 21 వరకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈ నెల 28న వార్డుల వారీగా తుది జాబితా ప్రకటిస్తామని తెలిపారు. ఈ సమావేశంలో ఎంపీఓ పాండురంగన్న, పార్టీల నాయకులు తూమాటి వరప్రసాద్‌రెడ్డి, ప్రెసిడెంట్‌ వెంకటాచారి, తొండపు సతీష్‌, ఉప్పగండ్ల శ్రీనివాస్‌, జనపనేని కృష్ణారావు, వేమూరి సురేష్‌, కస్తూరి సురేష్‌, కొల్లు నవీన్‌ తదితరులు ఉన్నారు.

సవరణలకు దరఖాస్తులు చేసుకోవాలి

నడిగూడెం : ఓటరు జాబితాలో సవరణలకు ఈ నెల 21 లోపు దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీఓ ఎస్‌డీ.ఇమామ్‌ కోరారు. గురువారం మండల పరిషత్‌ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, రాజకీయ పార్టీల నాయకులకు నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో ఆయన మాట్లాడారు. సమావేశంలో తహసీల్దార్‌ వి.సరిత, ఎంపీఓ విజయకుమారి, తదితరులు పాల్గొన్నారు.

ఓటరు జాబితాలో అభ్యంతరాలుంటే తెలపాలి

చిలుకూరు : ఓటరు జాబితాపై అభ్యంతరాలుంటే తెలియజేయాలని ఎంపీడీఓ గిరిబాబు అన్నారు. గురువారం చిలుకూరు మండల పరిషత్‌ కార్యాలయంలో ఓటరు జాబితాపై రాజకీయ పార్టీల నాయకులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటరు జాబితాపై అభ్యంతరాలు తెలియజేస్తే సవరించి తుది ఓటరు జాబితా ప్రచురించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీఓ జగదీష్‌, రాజకీయ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

నేరేడుచర్ల : ముసాయిదా ఓటరు జాబితాపై అభ్యంతరాలు ఉంటే ఈ నెల 21వ తేదీ వరకు తెలియజేయాలని ఎంపీడీఓ సోమసుందర్‌రెడ్డి అన్నారు. గురువారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో రాజకీయ పార్టీల నాయకులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జాబితాపై రాజకీయ పార్టీల నాయకుల అభ్యంతరాలు, సలహాలు, సూచనలు మేరకు జాబితా సరిచేసి 28వ తేదీన తుది జాబితా విడుదల చేయనున్నట్లు తెలిపారు. కాగా, గత ఎన్నికల్లో పట్టణ ఓట్లు గ్రామాల్లో, గ్రామాల ఓట్లు పట్టణాల్లో నమోదు అయ్యాయని బీఆర్‌ఎస్‌ మండల అధ్యక్షుడు అరిబండి సురేష్‌బాబు, సీపీఎం పట్టణ కార్యదర్శి కొదమగుండ్ల నగేష్‌, నీలా రామ్మూర్తిలు సమావేశం దృష్టికి తీసుకువచ్చారు. , మృతి చెందిన వారి ఓట్లను తొలగించాలని కోరారు. రెవెన్యూ శాఖ పంపించిన నివేదక ఆధారంగానే ఓటరు జాబితా రూపొందించామని, డబుల్‌ ఓటర్లు, మృతి చెందిన వారి ఓట్లు తొలగించడం రెవెన్యూ శాఖ చేపడుతుందని ఎంపీడీఓ తెలిపారు. ఈ సమావేశంలో ఎంపీఓ హరిసింగ్‌, వివిధ రాజకీయ పార్టీల నాయకులు ధనుంజయనాయుడు, అరిబండి సురేష్‌బాబు, నాగేశ్వర్‌రావు, నవీన్‌కుమార్‌, నగేష్‌, నంకలమద్ది సత్యనారాయణరెడ్డి, విజ య్‌కుమార్‌, శ్రీను, రామ్మూర్తి, రామస్వామి, సతీష్‌రెడ్డి, నాగనాయక్‌, నాగార్జున, కార్యదర్శులు ఉన్నారు.

మోతె : మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో గురువారంవివిధ పార్టీల నాయకులతో ఎంపీడీఓ ఆంజనేయులు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఓటరు జాబితాపై సలహాలు, సూచనలు స్వీకరించారు. ఆయన మాట్లాడుతూ.. వార్డుల వారీగా తయారు చేసిన ఓటరు జాబితాలో అభ్యంతరాలు ఉంటే దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. కాంగ్రెస్‌ పార్టీ మండల అధ్యక్షుడు కీసర సంతోష్‌రెడ్డి, న్యూడెమోక్రసీ మండల నాయకులు కోట మధుసూదన్‌రెడ్డి, దోసపాటి రాములు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

సాయుధ పోరాట యోధులు కమ్యూనిస్టులే


మాట్లాడుతున్న మల్లు నాగార్జున్‌రెడ్డి

మోతె : కమ్యూనిస్టులే తెలంగాణ సాయుధ పోరాట యోధులని సీపీఎం జిల్లా కార్యదర్శి మల్లు నాగార్జున్‌రెడ్డి అన్నారు. గురువారం మండలంలోని రాఘవాపురం గ్రామంలో కొరిపెల్లి లింగయ్య (డీలర్‌)జ్ఞాపకార్థం ప్రజానాట్య మండలి ఆధ్వర్యంలో నిర్వహించిన శౌర్య యాత్రలో ఆయన పాల్గొని మాట్లాడారు. సాయుధ రైతాంగ పోరాట స్ఫూర్తిపై నిర్వహించే నాటక ప్రదర్శన కమ్యూనిస్టుల చరిత్రకు నిదర్శనమన్నారు. సాయుధ పోరాటాలకు బీజేపీ మతం రంగు పులిమితే రాష్ట్ర ప్రజలు బుద్ధి చెబుతారన్నారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు మట్టిపెల్లి సైదులు, మండల కార్యదర్శి ములుకూరు గోపాల్‌రెడ్డి, నాయకులు కిన్నెర పోతయ్య, నాగమల్లయ్య, కాంపాటి శ్రీను, బత్తిని వెంకటేశ్వర్లు, జంపాల స్వరాజ్యం, బొర్రాజు వెంకన్న, రవిచంద్ర, ఒగ్గ సైదులు, తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌ నాయకుల ముందస్తు అరెస్టు


హుజూర్‌నగర్‌ : అరెస్టయిన బీఆర్‌ఎస్‌ నాయకులు

హుజూర్‌నగర్‌రూరల్‌ : రుణమాఫీ కాని రైతులకు వెంటనే రుణమాఫీ చేయాలని డిమాండ్‌ చేస్తూ ప్రజా భవన్‌ ముట్టడికి గురువారం హుజూర్‌నగర్‌ మండలంలోని వేపలసింగారం, బూరుగడ్డ నుంచి వెళ్తున్న బీఆర్‌ఎస్‌ నాయకులను పోలీసులు ముందస్తుగా అరెస్టు చేసి పోలీస్‌ స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా బీఆర్‌ఎస్‌ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి షేక్‌ నభి మాట్లాడుతూ.. అక్రమ అరెస్టులు సరికాదని అన్నారు. అరెస్టయిన వారిలో పార్టీ నాయకులు సారెడ్డి భాస్కర్‌రెడ్డి, అన్నెం కొండారెడ్డి, షేక్‌ అలీపాషా, మాడుగుల పరుశురాం, సుందరయ్య, సైదిరెడ్డి, బ్రహ్మారెడ్డి, తదితరులు ఉన్నారు.

నడిగూడెం : కాంగ్రెస్‌ ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్‌ చేస్తూ ప్రజా భవన్‌ ముట్టడికి బీఆర్‌ఎస్‌ పిలుపునివ్వడంతో బీఆర్‌ఎస్‌ నాయకులు హైదరాబాద్‌కు వెళ్లకుండా గురువారం నడిగూడెం పోలీసులు ముందస్తుగా అరెస్టు చేశారు. అరెస్టయిన వారిలో పార్టీ మండల అధ్యక్షుడు పల్లా నర్సిరెడ్డి, గార్లపాటి శ్రీనివాసరెడ్డి, బొల్లం శ్రీను, దాసరి శ్రీను, బోనగిరి ఉపేందర్‌, పోలంపల్లి వెంకటేశ్వర్లు, యాతాకుల వీరస్వామి, నూకపంగు ఈదయ్య, మొగలగాని శ్రీను, యలగొండ నాగేశ్వరరావు, తదితరులు ఉన్నారు.

హుజూర్‌నగర్‌ : బీఆర్‌ఎస్‌ పార్టీ పిలుపు మేరకు ప్రజాభవన్‌ ముట్టడికి హైదరాబాద్‌ వెళ్తున్న బీఆర్‌ఎస్‌ నాయకులను పోలీసులు గురువారం ముందస్తుగా అరెస్ట్‌ చేసి హుజూర్‌నగర్‌ స్టేషన్‌కు తరలించారు. అనంతరం వ్యక్తిగత పూచీకత్తుపై వారిని వదిలిపెట్టారు. కార్యక్రమంలో నాయకులు భాస్కర్‌రెడ్డి, నబీ, అన్నెం కొండారెడ్డి, అలి, సైదిరెడ్డి, పరశురామ్‌, సుందరయ్య, శ్రీనివాస్‌రెడ్డి, బ్రహ్మారెడ్డి వెంకటేశ్వర్లు, సైదులు, నాగులు, పాల్గొన్నారు.

పెట్టుబడి సాయం అందించాలి

నేరేడుచర్ల : ఎన్నికల్లో కాంగ్రెస్‌ పార్టీ రైతులకు ఇచ్చిన హామీ మేరకు పెట్టుబడి సహాయాన్ని తక్షణమే అందించాలని సీపీఎం మండల కార్యదర్శి సరికొండ శ్రీను డిమాండ్‌ చేశారు. గురువారం మండలంలోని పత్తేపురంలో నిర్వహించిన గ్రామ శాఖ సమావేశంలో ఆయన మాట్లాడారు. అనంతరం సీపీఎం పత్తేపురం గ్రామ శాఖ కార్యదర్శిగా మడుపు దేవయ్యను రెండవ సారి నియమించారు. సమావేశంలో సీపీఎం నాయకులు మచ్చ సోమయ్య, వెంకటయ్య, సామేలు, వెంకటయ్య, నరసయ్య ఉన్నారు.

కార్మికుల హక్కుల కోసం సీఐటీయూ పోరాటం

మేళ్లచెరువు : కార్మికుల హక్కుల కోసం నిరంతరం పోరాటాలు చేసేది సీఐటీయూ మాత్రమేనని ఆ యూనియన్‌ జిల్లా సభ్యుడు వట్టెపు సైదులు అన్నారు. గురువారం మండల కేంద్రంలో కార్మికుల సమస్యలపై ఆయన సర్వే చేపట్టి మాట్లాడారు. పనికి తగిన వేతనం, పని భద్రత కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్‌ చేశాడు. ఆయన వెంట సభ్యులు నాగేశ్వరరావు, గురవయ్య, జగన్‌, రాములమ్మ, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.